క్లుప్తంగా

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

గుడిపాల: మండలంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్ర తెలిపారు. గొల్లమడుగు, గొల్లమడుగు దళితవాడ, చింతగుంటూరు గ్రామాల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పర్యటిస్తారని చెప్పారు.

10 లోపు సబ్‌స్టేషన్లు ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్ : ఫిబ్రవరి 10వ తేదీ లోపు పుంగనూరు నియోజకవర్గంలో 6 సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నట్లు ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. ఆ నియోజకవర్గంలో రూ.54 కోట్లతో 18 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తునానరన్నారు. సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మరో వారంలోపు వస్తాయని, వాటిని అమర్చి, సాంకేతికంగా సరఫరాను పరీక్షిస్తామన్నారు. పులిచెర్ల, రొంపిచెర్ల ప్రాంతంలో మొత్తం 6 సబ్‌స్టేషన్లు అందుబాటులో వస్తాయన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బుధవారం నుంచి సామాజిక పింఛన్లను ఇళ్ల వద్దకే వచ్చి వలంటీర్లు ఇస్తారని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు ఐదు రోజుల లోపు పింఛన్లను పొందాలన్నారు.

వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న అధికారులు

బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన వాహనాల వేలంలో ప్రభుత్వానికి రూ 14,558 ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం, సారా అక్రమ రవాణా కేసులో స్వాధీనం చేసుకున్న నాలుగు ద్విచక్రవాహనాలను బహిరంగ వేలం వేసినట్లు తెలిపారు. ఎక్సైజు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షాదీమహల్‌కు తాగునీటి బోరు



బంగారుపాళెం: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని షాదీమహల్ వద్ద మంగళవారం తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. షాదీ మహల్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలని ముస్లింలు వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డినికోరారు. దీనిపై స్పందించిన ఆయన తన స్వంత బోరు పనులు ప్రారంభించారు. ముతవల్లి నూర్ మహ్మద్, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు సర్దార్, పలువురు ముస్లింలు శిరీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

కార్వేటినగరం: గ్యాస్ వినియోగంపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. మంగళవారం కామర్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ జే.బాబు ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన కలిప్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన కల్పించడానికి స్థానిక సత్యసాయి ఇండియన్ గ్యాస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రమాదం జరక్కుండా గ్యాస్ సిలిండర్‌ను వినియోగించే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు.

అర్హులందరికీ పథకాల ఫలాలు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి : అర్హులందరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు ఫలాలు అందిస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కొటాల, సాయి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు ప్రభుత్వ పథకాల పరంగా పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని పక్షంలో వారికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



కొటాలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పక్కన జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తమ ఇళ్లు మంజూరు చేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, రోడ్డు వేయాలని కొటాల వాసులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాలలో ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అధికారులు అభివృద్ధి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీటీసీ పూజిత, సర్పంచ్ నదియా, ఎంపీడీఓ శివరాజ్, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, కబీర్, సుబ్రమణ్యం, చిన్నబ్బ, వాసురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు కట్టకిందపల్లె, దళితవాడలో..

కొటాల సచివాలయ పరిధిలోని కట్టకిందపల్లె, దళితవాడలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ఎమ్మెల్యే టీచరైన వేళ..!

విద్యార్థులు : గుడ్ మార్నింగ్ సార్..!
ఎమ్మెల్యే : గుడ్ మార్నింగ్..గుడ్ మార్నింగ్
ఎమ్మెల్యే : పిల్లలూ! మీరు ఎక్కడ చదువుతున్నారు?
విద్యార్థులు : ప్రభుత్వ స్కూలులో సార్
ఎమ్మెల్యే : మీకు స్కూలులో ఏమేమి ఇచ్చారు?
విద్యార్థులు : కొత్తగా యూనిఫాం, పుస్తకాలు, పెన్నులు, షూలు ఇచ్చినారు సార్..బాగుండాయి.
ఎమ్మెల్యే : మరి మధ్యాహ్న భోజనం ఎలా ఉంది?
విద్యార్థులు : బాగుంది సార్. మెనూ ప్రకారం పెడుతున్నారు

ఇదీ కొటాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, విద్యార్థులకు నడుమ సాగిన సంభాషణ. మంగళవారం ఆయన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూలును ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. సౌకర్యాలు, వసతులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. టీచర్ పాత్రలోకి మారి తల్లిదండ్రులు, పెద్దలతో ఎలా నడచుకోవాలో హితోపదేశం చేశారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పిల్లలకు కోడి గుడ్డు, పులిహోరా, టమాట పచ్చడి వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, ఎంఈఓ రుక్మిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - యాదమరి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిరుధాన్యాలు సాగుచేయండి

గుడిపాల: చిరుధాన్యాలను సాగుచేయాలని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ గోపాల్ అన్నారు. మంగళవారం చిత్తపారలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. వరి సాగు తగ్గించి, తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలైన సజ్జలు, కొర్రలు, రాగులు, ఊదలు మొదలగు వాటిని సాగు చేయాలని సూచించారు. అంతేకాకుండా వీటిని చీడపీడలు కూడా ఆశించవచ్చన్నారు. చిరుధాన్యాల సాగుతో ఆదాయం కూడా అధికంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీ ఏలు నాగపద్మిణి, లక్ష్మీప్రసన్న, వ్యవసాయాధికారి మాధవి, వ్యవసాయ సహాయకులు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాగిపంటను పరిశీలిస్తున్న గోపాల్

'మేడం వస్తున్నారు.. చిన్న గుడ్లు వద్దు!'

యాదమరి: కోడిగుడ్లు నిర్దేశించిన పరిమాణం కంటే చిన్నవిగా ఉన్నాయని అంగన్‌వాడీ కార్యకర్త వాటిని తీసుకునేందుకు తిరస్కరించడంతో ఏజెన్సీ నిర్వాహకులు కంగుతిన్నారు. మంగళవారం ఈ సంఘటన దాసరాపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి కోడిగుడ్ల వ్యానుతో ఏజెన్సీ వ్యక్తులు వచ్చారు. మండలంలోని ప్రభుత్వ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు పదిరోజులకోసారి కోడిగుడ్లను ఏజెన్సీ సరఫరా చేస్తోంది.గుడ్డు 50 గ్రాముల బరువు ఉండాలి. కానీ చిన్న కోడిగుడ్లు ఉన్నాయంటూ తీసుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్త తిరస్కరించారు. ఈ రూట్‌లో ఎమ్మెల్యే ప్రోగ్రాం ఉందని, పైగా తమ మేడం కూడా వస్తారని, వారు తనిఖీ చేస్తే కోడిగుడ్ల విషయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆమె చెప్పడంతో ఏజెన్సీ వ్యక్తులు గుడ్లు తేలేశారు!



కోడి గుడ్లను తిరస్కరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

సింహ వాహనంపై శివపార్వతులు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లు సింహ వాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో విచ్చేసిన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి,అమ్మవార్లు శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో తెలిపారు.



జగన్నన కాలనీ తనిఖీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగన్నన కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. మంగళవారం ఆమె మండలంలోని పి.కొత్త కోట లేఔట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. పనులు పూర్తయ్యేలా తరచూ పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీ దేవిక, సర్పంచ్ పద్మజారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను బుల్‌డోజర్‌తో తొక్కిస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలో అక్రమ మద్యం రవాణాకు సంబంధించి 36 కేసులు నమోదు చేసి, 11,964 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్సైజు అధికారుల సమక్షంలో మద్యం బాటిళ్లను ఊటువంక సమీపంలో బుల్‌డోజర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు తెలిపారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు దామోదరనాయుడు

పూతలపట్టు: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దామోదరనాయుడు అన్నారు. మంగళవారం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. 60 రోజుల్లో పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని, పిల్లలకు టివి, సెల్ ఫోన్‌తో కాలక్షేపం చేయకుండా చూడాలన్నారు. రోజూ తెల్లవారుజామున చదివించాలని కోరారు. తాము కూడా రాత్రుల్లో తనిఖీలకు వస్తామని, విద్యార్థులు చదువుతున్నారా, లేదా? అని పరిశీలిస్తామన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి జస్వంత్ జాతీయ స్థాయి అండర్-14 త్రోబాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం రవి తెలిపారు. నంద్యాలలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి కి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంఈఓ హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలకు స్వచ్ఛమైన గాలి ముఖ్యం



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

- సమన్వయ కృషి చేద్దాం
- కమిషనర్ అరుణ పిలుపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర వాసులకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి అందరూ సమన్వయ కృషి చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కెపాసిటీ బిల్డింగ్ అండ్ పబ్లిక్ ఔట్ రీచ్ వర్క్ షాప్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, గాలిలో కర్బన ఉద్గారాలు ఎక్కువగా, ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రాణవాయువు నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో పచ్చని మొక్కలు, చిన్నపాటి పార్కులు, వాటర్ పౌంటైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు సైతం సామాజిక బాధ్యతగా తమవంతు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్తలు గాలి నాణ్యతను పెంచడంపై పరిశ్రమల నిర్వాహకులు, వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ నరేంద్ర, శాస్త్రవేత్త సుధాకర్, ఎన్ఏఆర్ఎల్ సాంకేతిక సలహాదారులు వికాస్ సింగ్, హరీష్, మునిసిపల్ ఇంజనీర్ ధనలక్ష్మి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రవాణాశాఖ, పరిశ్రమలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనగుంట దళితవాడలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ఇంటివద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కొనగుంట దళితవాడలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు, 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారిని, గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రతి నెలా వైద్య బృందం గ్రామంలో వైద్య సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె : తెల్లగుండ్లపల్లెలో వికలాంగుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి

తెల్లగుండ్లపల్లెలో…

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగులను ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. తొలుత శిబిరంలో 95మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ అర్చకునికి సన్మానం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పదవీ విరమణ పొందిన అర్చకులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆలయంలో ఐదు దశాబ్దాలుగా స్వామివారి సేవలో తరలించిన అర్చకులు బిజి.సత్యసాగర్ శర్మ మంగళవారం విరమణ పొందారు. స్వామివారి సమావేశ మందిరంలో ఆయన్ను అధికారులు సన్మానించి, ఆయన సేవలను ప్రస్తుతించారు. ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, హేమమాలిని, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సత్యసాగర్‌శర్మను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

రేపు ఆలయ పుష్కర కుంభాభిషేకం



కుంభాభిషేకానికి సిద్ధమైన విజయగణపతి ఆలయం

నగరి : మండలంలోని కావేటిపురం గ్రామంలోని శ్రీ విజయగణపతి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 3వ తేదీన వేద పారాయణం, గోపూజలో పుష్కర కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త ఎ.రామకృష్ణ తెలిపారు. ఈ నెల 5వ తేదీన మహాకుంభాభిషేకం, మూలవిరాట్‌కు మహా సంప్రోక్షణ, శ్రీ విజయగణపతి దర్శనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



ఆర్థికసాయం అందిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

కుంభాభిషేకానికి విరాళం

మండలంలోని బుగ్గఅగ్రహారం గ్రామ ప్రజల చిరకాల కోరిక మేరకు గ్రామ దేవత శ్రీ మాతమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి తన చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సోదరుడు రాంప్రసాద్ రెడ్డి ఆర్థిక సాయాన్ని గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, ఉపసర్పంచ్ నిర్మల, వెంకటరెడ్డి, కుమారస్వామి, సత్య, శివయ్య పాల్గొన్నారు.

జిల్లా మహాసభల కరపత్రాల విడుదల




కరపత్రాలు చూపుతున్న ఆశాకార్యకర్తలు

నగరి : ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. మంగళవారం ఆశా కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోదండయ్య మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కిందిస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల ఆరోగ్య సంక్షేమమే ప్రధానంగా పనిచేస్తున్న ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగిరి పట్టణ గౌరవ అధ్యక్షుడు వేలన్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి చందామర్లై, నాయకులు విజయలక్ష్మి, హంస, అరుణ, మాణిక్యమ్మ, పుష్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు భేష్

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చాలా బాగుందని కేంద్ర బృందం సభ్యులు కితాబిచ్చారు. జిల్లాలో పదిరోజులుగా కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణాభివృద్ధి శాఖలో జరుగుతున్న పనులను పరిశీలనకు విచ్చేసిన కేంద్ర బృందం సభ్యులైన సత్యబెహరా, శశికుమార్‌సాహు మంగళవారం పల్లెబాట కార్యక్రమంలో ఉన్న మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి బాగా జరిగిందని, ఇందులో మంత్రిగా మీ సహకారం ఎంతో ఉందని తమ పర్యటనలో తెలిసిందని రామచంద్రారెడ్డికి వివరించారు. ఏపీలో ఉన్న వ్యవస్థలు ఇతర రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయ పడ్డారు.అనంతరం కేంద్ర బృందం సభ్యులను మంత్రి సత్కరించారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



నందవనం కళాశాలలో బెంచీల సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కొత్తపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులు, భూగర్భశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలో మంగళవారం నాలుగో రోజు పల్లె బాట కార్యక్రమంలో 6 పంచాయతీల్లోని 46 గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో మహిళలు హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ..అభివాదం చేస్తూ పర్యటన సాగించారు. తమకు చేకూరిన పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రతి ఒక్కరూ మంత్రి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఎల్లంకివారిపల్లె, పోశంవారిపల్లె, కల్లూరు, కొమ్మిరెడ్డి గారిపల్లెలో ఆర్ఓ ప్లాంట్‌లు, కావేటిగారిపల్లెలో వైఎస్సార్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, దిన్నెపాటి దళితవాడలో కమ్యూనిటీ హాల్, కల్లూరులో జిల్లా పరిషత్ అతిథి భవనాలను ప్రారంభించారు.

జూనియర్ కళాశాలలో బెంచీల ప్రారంభం

కొత్తపేట నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దాత దశరథరెడ్డి (ఎసీటీఎస్ స్వచ్ఛంద సంస్థ) వితరణగా అందజేసిన 60 బెంచీలు(డెస్క్)లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. దాతను అభినందించారు.

సంచార పశువైద్య వాహనం ప్రారంభం

కల్లూరులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. రైతుల ముంగిటకే ఈవాహనం ద్వారా పశువైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ లబ్ధి ఇంటి ముంగిటకే అందుతోందని పేర్కొన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, పెద్దిరెడ్డి, జిల్లా ప్రిటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పీఏ మునితుకారాం, ఎన్ఎస్‌రెడ్డి ప్రకాష్, పోకలచంద్ర, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, షుకూర్, సౌకత్‌అలీ, రాఘవరెడ్డి, రాజశేఖరరెడ్డి, సైపుల్లా, ఆనంద, రెడ్డి బాబుల్లా, విజయకుమార్ పాల్గొన్నారు.